సాక్షి చిత్తూరు

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



కూటమికి తప్పదు ఓటమి

కూటమి పార్టీలకు ఎన్నికల్లో ఓటమి తప్పదని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెల్వమణి తెలిపారు. - IIలో



నృత్యం.. వినూత్నం!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా చిత్తూరులో చిన్నారులు నృత్యం ప్రదర్శించారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం(ఉ)
చిత్తూరు	6.30	4.47
పుంగనూరు	6.32	4.51

న్యూస్‌రీల్

24 నుంచి వేసవి సెలవులు

- జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 24వ తేదీ నుంచి అన్ని యాజమాన్యాల పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సమ్మేటివ్–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 20, 21 తేదీల్లో జవాబుపత్రాలను టీచర్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుందన్నారు.23 తేదీన విద్యార్థులను పై తరగతులకు బదిలీ చేస్తూ ప్రొగ్రెస్ కార్డులు అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు వేసవి సెలవులు ఉంటాయని తెలిపారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని వివరించారు.

టీడీపీ వేధింపులకే రాజీనామా



కమిషనర్‌కు రాజీనామా పత్రం అందిస్తున్న లత

పుత్తూరు: టీడీపీ నాయకుల వేధింపులకు తట్టుకోలేకే రాజీనామా చేస్తున్నట్లు గోవిందపాళెం సచివాలయ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్ లత తెలిపారు. మంగళవారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మూర్తికి రాజీనామా పత్రం సమర్పించారు. లత మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నామని, ప్రభుత్వ పథకాలను ఠంచన్‌గా అందిస్తున్నామన్నారు. అయితే నిత్యం టీడీపీ నేతల వేధింపులు తీవ్రతరం కావడంతో మనస్తాపానికి గురై రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఇకపై స్వేచ్ఛగా ముఖ్యమంత్రి జగనన్న, మంత్రి రోజాకు మద్దతుగా పనిచేసామని స్పష్టం చేశారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

– 15 వరకు ఓటరు దరఖాస్తుల పరిశీలన



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతి తప్పనిసరని చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదలవుతుందని, అప్పటి నుంచి ప్రచార ఖర్చులను ఆయా అభ్యర్థుల ఖాతాల్లో జమ చేయడం మొదలుపెడతామని వెల్లడించారు. ఇప్పటికే ఈ మేరకు అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ మాన్యువల్స్ అందించామన్నారు. అందులో పేర్కొన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో కచ్చితంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రచారానికి అవసరమైన అనుమతులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పొందవచ్చని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సందేహాలు, సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ నెల 15వ తేదీ వరకు వచ్చిన కొత్త ఓటరు దరఖాస్తులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. అయితే ఓటర్ల బదిలీకి అవకాశం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఆర్‌ఓలు అరుణ, శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్, వివిధ పార్టీల ప్రతినిధులు లోకేష్, భాస్కర్, రాజసింహులు, ఉదయ్ పాల్గొన్నారు.

ఎస్పీ జాషువా బదిలీ

చిత్తూరు అర్బన్: ఎస్పీ పి.జాషువాను బదిలీ చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లా నుంచి ఫిబ్రవరి 4వ తేదీన జాషువా చిత్తూరు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు నెలల పాటు ఆయన చిత్తూరులో ఎస్పీగా పనిచేశారు. ఎన్నికల సంఘం ఉత్తర్వులు మేరకు ఆయన వెంటనే రిలీవ్ అయ్యారు. ఏఎస్పీ ఆరీఫుల్లాకు ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.

జైత్రయాత్రకు నీరాజనం



చౌడేపల్లె : సీఎం వైఎస్ జగన్ రోడ్ షోకు విచ్చేసిన జన సందోహం

బోయకొండ క్రాస్ వద్ద ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభివాదం

వైఎస్సార్‌సీపీ పూరించిన ఎన్నికల శంఖారావం దశదిశలా మార్మోగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు ప్రజానీకం నీరాజనం పడుతోంది. మేమంతా సిద్ధం అంటూ జేజేలు పలుకుతోంది. మంగళవారం ఈ మేరకు మదనపల్లెలో సభ ముగించుకుని జిల్లాలో అడుగుపెట్టిన జగనన్నకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. సంక్షేమ ప్రదాతపై వెల్లువెత్తిన అభిమానం పూలవర్షమై కురిసింది. పుంగనూరు నియోజకవర్గంలో ప్రారంభించిన రోడ్ షోకు అశేష జనసందోహం తరలివచ్చింది. జయహో జగన్ నినాదాల నడుమ ఉద్వేగంగా అమ్మగారిపల్లెలోని రాత్రి బస కేంద్రం వరకు యాత్ర కొనసాగింది.

- చౌడేపల్లి, సోమలలో సీఎం వైఎస్ జగన్ రోడ్ షో
- మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు అడుగడుగునా అపూర్వ స్వాగతం
- సదుం మండలం అమ్మగారిపల్లెలో రాత్రి బస చేయనున్న ముఖ్యమంత్రి
- నేడు పూతలపట్టులో బహిరంగ సభ
- రాత్రికి తిరుపతి జిల్లా రేణిగుంటలో బస

సాక్షి, చిత్తూరు : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బస్సు యాత్ర ముగించుకున్న అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి 8 గంటలకు పుంగనూరు నియోజకవర్గంలోకి ప్రవేశించారు. చౌడేపల్లి మండలం కృష్ణాపురం వద్ద ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి బోయకొండ క్రాస్ మీదుగా సదుం మండలంలోని అమ్మగారిపల్లె వరకు బస్సు యాత్ర జన నీరాజనాల మధ్య సాగింది.

చౌడేపల్లె, సోమలలో రోడ్‌షో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుంగనూరు నియోజవర్గ ప్రజలు అపూర్వంగా స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపించారు. బోయకొండ క్రాస్ వద్ద జగన్ బస్సు దిగి ప్రజలతో మమేకమయ్యారు. మంగళవారం రాత్రి 9.15 గంటలకు సీఎం జగన్ రోడ్ షో చౌడేపల్లెకు చేరుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బస్సు పైకి వచ్చి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం చెన్నపట్నం డ్యామ్, చెన్నావారిపల్లె క్రాస్, ఇరికిపెంట గ్రామాల మీదుగా సోమల చేరుకుని రోడ్ షో నిర్వహించారు. వేలాదిగా మహిళలు, యువత ముఖ్యమంత్రిపై పూల వర్షం కురిపించారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రజలకు అభివాదం చేస్తుండగా బస్సు ముందుకు కదిలింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డితో కలసి ప్రజలను ఎక్కడికక్కడ పలకరిస్తూ యాత్రను కొనసాగించారు.



చౌడేపల్లె : ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్, పక్కన మంత్రి పెద్దిరెడ్డి



స్వాగతం పలుకుతున్న ఆడపడుచులు

సీఎం సార్.. మళ్లీ మీరే రావాలి

సీఎం సార్.. మీ పాలన మరువలేనిది.. మళ్లీ మీరే రావాలి.. అంటూ జనం నినాదాలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా పెద్దసంఖ్యలో బారులు తీరిన ప్రజలు తమ అభిమాన నేతను చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

నృత్యంతో స్వాగతం

సీఎం వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో షికారీలు నృత్యం చేస్తూ వినూత్నంగా స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలతో తమ బతుకులను మార్చారని నినాదాలు చేశారు. పక్షిరాజపురం వద్ద షికారీలకు జగనన్న అభివాదం చేస్తూ వారిని ఉత్సాహపరిచారు.

మహిళలు, యువతే అధికం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు మహిళలు, యువత అధికంగా తరలివచ్చారు. జగన్‌ను చూసేందుకు సాయంత్రం నుంచే జనం తండోపతండాలుగా రోడ్లకు ఇరువైపులా బారులు తీరారు. పల్లెపల్లెలో జగనన్నకు నీరాజనాలు పట్టారు.

మేము సైతం అంటూ మైనారిటీలు

పెద్దూరు క్రాస్‌తోపాటు అనేక ప్రాంతాల్లో ముస్లిం మైనారిటీలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమ అభిమాన నేతను చూస్తూ.. సీఎం సాబ్..సీఎం సాబ్.. అంటూ అభిమానం చాటుకున్నారు. ముఖ్యమంత్రి సైతం ముకుళిత హస్తాలతో వారిని పలకరించారు. అక్కడి నుంచి సందూరు క్రాస్, సూరయ్యగారిపల్లె క్రాస్, ఊటుపల్లె క్రాస్, అగ్రహారం క్రాస్, గొంగివారిపల్లె మీదుగా అమ్మగారిపల్లె బస కేంద్రం వద్దకు చేరుకున్నారు. బస్సులో ముఖ్యమంత్రి వెంట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఉన్నారు.

నేటి యాత్ర ఇలా...

సాక్షి,చిత్తూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం బస్సుయాత్ర ఏడోరోజు బుధవారం చిత్తూరు, తిరుపతి జిల్లాలో సాగనుంది. ఉదయం 9 గంటలకు పుంగనూరు నియోజకవర్గం అమ్మగారి పల్లె నుంచి సీఎం జగన్ బయలుదేరి సదుం, కల్లూరు, దామలచెరువు, తలుపులపల్లె మీదుగా తేనెపల్లె చేరుకుంటారు. భోజన విరామం తర్వాత పూతలపట్టు జాతీయ రహదారి సమీపంలో మేమంతా సిద్ధం పేరిట ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. తర్వాత రంగంపేట క్రాస్ నుంచి తిరుపతి జిల్లాలోని గొల్లపల్లి, గాదంకి, కొంగరవారిపాళెం, మామండూరు మీదుగా రేణిగుంట సమీపంలో రాత్రి బస కేంద్రానికి చేరుకుంటారు.



అన్నతో కరచాలనానికి పోటీ పడుతూ..



ఆనందోత్సాహం ఉప్పొంగే..



అక్కచెల్లెమ్మల ఆశీర్వాదం..



సోమల : ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సోమల : ప్రియతమ నేతను చూసేందుకు అంతస్తులు ఎక్కిన అభిమానం



అందగా ఉంటా.. అవ్వలకు అభయం

వైభవంగా గంగ జాతర ప్రారంభం

- సుగుటూరు గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణమ్మ
- నేడు అమ్మవారి దర్శనానికి భక్తులకు అనుమతి

పుంగనూరు : జమీందారుల కుల దైవం సుగుటూరు గంగమ్మ తల్లి జాతర మంగళవారం రాత్రి తొలిరోజు వైభవంగా ప్రారంభమైంది. తొలుత ప్యాలెస్‌లో అమ్మవారికి జమీందారులు సోమశేఖర్ చిక్కరాయల్ , మల్లికార్జునరాయల్, కుటుంబ సభ్యులు తొలి పూజ నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణమ్మ చేతులమీదుగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి పట్టణంలోని ప్యాలెస్ వీధి, తేరువీధి, సెంటర్‌లాడ్జి, సుబేదారువీధి, తూర్పుమొగశాల, కుమ్మరవీధి, కట్టక్రిందపాళ్యం మీదుగా ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున ఊరేగింపు పూర్తయిన తర్వాత అమ్మవారిని జమీందారుల ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలో కొలువుదీర్చనున్నారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. ఈ సందర్భంగా బెస్త కులస్తులు , తోటి కులస్తులు అమ్మవారికి సారె సమర్పించనున్నారు. అనంతరం జమీందారులు సంప్రదాయబద్ధంగా ఆలయానికి విచ్చేసి విశేష పూజలు చేపట్టనున్నారు. రాత్రి 11 గంటలకు అమ్మవారిని నిమజ్జనం చేయనున్నారు. జాతర పరిపూర్ణమైన తర్వాత ఆనవాయితీ ప్రకారం విగ్రహాలను ప్యాలెస్‌లో భద్రపరచనున్నారు.

పకడ్బందీ బందోబస్తు

సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు కల్పించారు. డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రాఘవరెడ్డి పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకారంలో సుగుటూరు గంగమ్మ



విద్యుద్దీపాలతో అలంకరించిన ప్యాలెస్

ఎన్నికల ప్రచారంలో రీసోర్స్‌పర్సన్



టీడీపీ, బీజేపీ నాయకులతో ఆర్పీ ధనలక్ష్మి

నగరి : టీడీపీ నేతల ఎన్నికల ప్రచారంలో నగరి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన రీసోర్స్‌పర్సన్ ధనలక్ష్మి పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ నాయకులతో కలిసి ఆమె ప్రచారం చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో మంగళవారం వైరల్‌గా మారాయి. దీనిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. ఆమెపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు వెల్లడించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- 2,74,553 మంది లబ్ధిదారులకు రూ.80.39 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం లబ్ధిదారులకు నగదు అందించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా జిల్లాలోని మొత్తం 2,74,553 మంది పెన్షనర్లకు రూ.80.39 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ఉదయం ఆయా మండలాల్లోని బ్యాంకుల నుంచి సచివాలయ ఉద్యోగులు నగదు డ్రా చేయున్నారు. తర్వాత జిల్లాలోని మొత్తం 612 గ్రామ, వార్డు సచివాలయాల్లో 17 కేటగిరీల లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నారు. ఈ నెల 6వ తేదీ లోపు పింఛన్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా ప్రక్రియ



పింఛన్ల పంపిణీలో అనుసరించాల్సిన నిబంధనలను క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేశాం. బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసేందుకు తహసీల్దార్లు ఆయా సచివాలయాల కార్యదర్శులకు అనుమతి ఇవ్వాలి. అనంతరం సచివాయాలల్లో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పింఛన్ అందించాలి. సచివాలయాలకు రాలేని వారిని గుర్తించి 6వ తేదీన వారి ఇంటి వద్దకే వెళ్లి నగదు పంపిణీ చేయాలని ఆదేశించాం. పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేశాం. పకడ్బందీగా పింఛన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తాం. – షణ్మోహన్, కలెక్టర్

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన నేతలతో మంత్రి రోజా

విజయపురం : మండలంలోని గొల్లకండ్రిగ దళిత వాడకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం ఈ మేరకు మంత్రి ఆర్కే రోజా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మల్లిక, సురేష్, రజాతి, మహాదేవి, రత్నం, నాంచారి నవనీతం, నారాయణన్ మురళి విజయ్ మాట్లాడుతూ ప్రజలపై మంత్రి రోజా చూపిస్తున్న ప్రేమాభిమానాలు చూసి పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఆమె నాయకత్వంలో పనిచేయడం గొప్పగా భావిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాజగోపాల్, జిల్లు , సర్పంచ్ గోవింద రెడ్డి , నేతలు గుణశేఖర్‌రెడ్డి, ఢిల్లీ, కుమార్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన కృష్ణారెడ్డి



కృష్ణారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : పట్టణంలోని 26వార్డుకు చెందిన టీడీపీ కీలక నేత మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమీప బంధువు కృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ అమరనాథరెడ్డి తనకు బంధువైనా ప్రజల కోసం వైఎస్సార్‌సీపీనే మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి జగనన్న నాయకత్వమే కావాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ కో– ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, కౌన్సిలర్ రాజేష్, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు మండీ సుధా, మురళీకృష్ణ, ప్రహ్లాద, సోము, శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

కక్షగట్టి.. కడుపుగొట్టి!

ఒకటో తారీఖున ఇంటికి వచ్చి పింఛన్ అందించే వలంటీర్ రాలేదు.. ప్రతి నెలా వేకువనే తలుపు తట్టి ఠంచన్‌గా పింఛన్ అందించే ఆపద్బాంధవుడి జాడలేదు.. రెండో తేదీ గడిచినా చేతికి నగదు అందలేదు.. అవ్వాతాతల్లో ఆందోళన పెరిగిపోతోంది.. దివ్యాంగుల్లో ఆవేదన అధికమవుతోంది.. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల్లో ఆక్రోశం అవధులు దాటుతోంది.. గడప దాటే ఓపిక లేదు.. సచివాలయానికి వెళ్లేందుకు ఆరోగ్యం సహకరించదు.. చంద్రబాబుకు తమపై ఎందుకు ఇంత కక్ష అని పెన్షనర్లు కుమిలిపోతున్నారు. శక్తి ఉడిగి ఉసూరుమంటున్న మా కడుపుగొట్టి ఆయన సాధించిందేంటని ప్రశ్నిస్తున్నారు. జీవిత చరమాంకంలో ప్రశాంతంగా బతుకు వెళ్లదీసే పరిస్థితికి మోకాలడ్డంపై మండిపడుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇలాంటి కుట్రలు మంచిది కాదు



నా కుమారుడు హర్షవర్ధన్ నరాల బలహీనతతో మంచానికే పరిమితమయ్యాడు. 2020 నుంచి ప్రభుత్వం రూ.5 వేల పింఛన్ అందజేస్తోంది. వలంటీర్ ఒకటో తేదీన తలుపు తట్టి మరీ పింఛన్ ఇచ్చి వెళ్లేవారు. మా ఊరి నుంచి చంటి పిల్లోడిని ఎత్తుకుని సచివాలయం వద్దకు వెళ్లి గంటల తరబడి పడిగాపులు కాస్తే చంద్రబాబునాయుడుకు మంచిగుంటుందేమో. వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం ఉన్నప్పుడు, పెన్షన్ మాత్రం ఇంటి దగ్గరనే ఎందుకు అందించకూడదు. వలంటీర్ వచ్చి మాకు పింఛన్ ఇస్తే తప్పేముంది. గత ఐదేళ్లుగా ఇంటి వద్దకు వచ్చే పింఛన్ ఇస్తున్నారు కదా. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ఇలాంటి కుట్రలు చేయడం మంచిది కాదు. మా ఇంటికొచ్చి పింఛన్ ఇస్తే వారి సొమ్మేం పోతుంది. పింఛన్ డబ్బులతోనే మా బిడ్డకు మందులు కొనేదాన్ని. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఈ పాపం ఊరికే పోదు.

- సంధ్య, గుడిపాల మండలం

చంద్రబాబుది దుర్మార్గం



నా వయస్సు 67 ఏళ్లు. ఎండలేమో మండుతున్నాయి. అడుగు బయట పెట్టాలంటే ఎక్కడ వడ దెబ్బ తగులుతుందోనన్న భయం. నేను ప్రతి నెలా రూ.3 వేలు వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్నా. ఈ సారి ఆ చంద్రబాబునాయుడు చేసిన దుర్మార్గపు పని వల్ల అది కూడా రాలేదు. ఆయన జీవితం మొత్తం ఇలాంటి దుర్మార్గపు పనులే చేస్తుంటారు. ప్రతి నెలా ఒకటో తేదీన వచ్చే నా పింఛన్‌ను రానివ్వకుండా చేశారు. ఆయనకు కచ్చితంగా మా ఉసురు తగులుతుంది. నాలాంటి ముసలి వాళ్లను టీడీపీ పాలనలోనూ ఇబ్బంది పెట్టారు. ఇప్పుడు మళ్లీ అలాంటి హింసలు పెట్టేందుకు సిద్ధమయిపోయారు. రూ.3 వేల పింఛన్ డబ్బు నా కుటుంబానికి చాలా ఉపయోగపడేది. నాకు అవసరమైన మందులు, ఇంటికి అవసరమైన సరుకులు ప్రతి నెలా సమయానికి తెచ్చుకునేవాడిని. ప్రభుత్వం క్రమం తప్పకుండా సకాలంలో పింఛన్ అందిస్తుంటే ఓర్వలేక అడ్డుకుంటున్నారు. నాలాంటి ముసలి వాళ్లను సచివాలయాల వద్దకు ఎవరు తీసుకెళతారు. **- మునిక్రిష్ణ, గుడిపాల మండలం**

కాలు లేనోడిని ఎలా వెళ్లేది?



నాకేమో కాలు లేదు. నాకు సహాయం చేసే వారు ఎవ్వరూ లేరు. ఎవరో ఒకరిని ప్రాధేయపడితే కొంత సమయం సహాయం చేస్తారు. ఇప్పుడు నేను సచివాలయం వరకు వెళ్లాలంటే ఎవరు సహాయం చేస్తారు చంద్రబాబు? ఇన్ని రోజులు ప్రతి నెలా ఒకటవ తేదీన వలంటీర్ల పుణ్యమా అని నాకు వచ్చే రూ.3 వేలు పింఛన్ తీసుకున్నా. ఈ నెల పింఛన్ ఇస్తే ఆ డబ్బులతో ఇంటికి అవసరమైన సరుకులు తెచ్చుకుందామని అనుకున్నా. ఇంతలోనే మా ఊళ్లో వాళ్లు చెప్పారు వలంటీర్ వచ్చి పింఛన్ ఇవ్వడు నువ్వే వెళ్లి తెచ్చుకోవాలని. నాలాంటి దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించారని తెలిసింది. మా ఓటు కోసం చంద్రబాబు నాయుడు వారి అభ్యర్థులను మా ఇంటికి పంపవచ్చు. వలంటీర్లు మా ఇంటికొచ్చి మా జీవనాధారమైన పింఛన్ ఇస్తే తప్పేముంది. ఆ మాత్రం మా గోస మీకు అర్థం కావడం లేదా చంద్రబాబు. ఎందుకు ఇంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నావు. బాబు చేసిన పనికి కిలోమీటర్ దూరంలో ఉన్న సచివాలయం వద్దకు ఎలా వెళ్లాలనే దిగులు నాలో పుట్టుకుంది. మా పొట్టకొడుతున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతాం. **- దొరస్వామి, చిత్తూరు రూరల్ మండలం**

చంద్రబాబు తీరు దారుణం



పుట్టుకతో నాకు వికలాంగత్వాన్ని దేవుడు ఇచ్చాడు. నాయీ బ్రాహ్మణ కుల వృత్తి పై ఆదారపడి మా నాన్న కుటుంబం పోషిస్తున్నాడు. అంగవైకల్యంతో నేను కుటుంబానికి బారం అయ్యానని గతంలో బాధ పడేవాడిని. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఠంచన్‌గా అందిస్తున్న పింఛన్‌తో కాస్త ఊరట చెందా. ఆ డబ్బులు మా కుటుంబానికి, నాకు ఆస్పత్రి ఖర్చులకు ఉపయోగపడేవి. ఒకటో తారీకు తెల్లవారే వలంటీరు మా ఇంటి దగ్గరుకు వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్లేవాడు. ఇప్పుడేమో సచివాలయానికి వెళ్లి తీసుకోవాలంటున్నారు. పోలింగ్ బూత్ దగ్గరుకు రాలేనివారికి నేరుగా ఇంటి దగ్గరే ఓటు వేసే హక్కు కల్పిస్తున్నారని తెలిసింది. అలాంటప్పుడు మా ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తే ఏమవుతుంది. చంద్రబాబు రాజకీయాలకు మాలాంటి అభాగ్యులు బలైపోతున్నారు. బాబు వైఖరి చాలా దారుణంగా ఉంది. ఎన్నికల సమయంలోనే ఇలా చేస్తుంటే అధికారంలోకి వస్తే పింఛనే లేకుండా చేస్తారేమో భయంగా ఉంది. నేను లేచి కూర్చోనే లేను. అలాంటప్పుడు సచివాలయానికి వెళ్లి పింఛన్ ఎలా తీసుకోగలను. ఇదంతా చంద్రబాబు చేసిన పనే. ఇలాంటి వ్యక్తికా ఇన్నాళ్లు ఓటేసిందని సిగ్గుగా ఉంది.

- శివకుమార్, కుప్పం

మా కడుపు మంట చంద్రబాబుకు తగులుంది



కొన్నేళ్లకు ముందు నాభర్త నారాయణప్ప చనిపోయాడు. మొన్న కరోనాలో నా కొడుకు సుబ్రమణ్యం మరణించాడు. నా కుమార్తెకు పెళ్లి చేశా. ఆవును మేపుతూ పొలం వద్ద పడిపోవడంతో నాకు నడుము విరిగిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా మంచలోనే ఉన్నా. నెలనెలా వచ్చే పింఛనుతోనే బతకు వెళ్లదీస్తున్నా. ఆ వచ్చే డబ్బులే మందులు, భోజనానికి దిక్కు. నన్ను చూసేవారెవరూలేదు. ఇన్నాళ్లు వలంటీర్ వచ్చి ఇంటికాడిన్నే పింఛన్ డబ్బు ఇచ్చిపోయేవాడు. ఇప్పుడు వాళ్లని తీపించేసి చంద్రబాబు పుణ్యం కట్టుకుండాడంటనే. వలంటీర్ లేనందుకు ఇంకా డబ్బు రాలేదు. మా ఊరి నుంచి దేవదొడ్డిలోని సచివాలయానికి పోవాలంటే ఏడు కిలోమీటర్లు. బస్సులు లేక ఆటోలో పోవాల. నాకేమో నడిచేందుకు కాదు. కనీసం నన్ను ఆటోలో తీసుకెళ్లు వాళ్లు కూడా లేరు. ఎవరైనా సాయానికి వస్తే వారికి కూలిగా రూ.200, ఆటోకి రూ.400 ఇవ్వాలి, దానికి కూడా ఎవరూ రారు. నేను ఎట్టా సచివాలయానికి వెళ్లేదో అర్థం కావడం లేదు. పింఛన్ డబ్బు లేకుంటే నాకు గతిలేదు. మాలాంటి వాళ్ల కడుపుమంట చంద్రబాబుకు తగులుతుంది. పేదలు బాగుంటే ఆయబ్బకి నిద్రరాదేమో.

- కిట్టమ్మ, కామినేపల్లె, బైరెడ్డిపల్లె మండలం

మా పొట్టగొట్టారు



వలంటీర్లు చేత పింఛన్లు పంచనీకుండా చంద్రబాబు మా పొట్టగొట్టారు. ఏమి చేసేది నాయనా. గవర్నమెంటు పెట్టిన వలంటీర్లు ఇంటికే వచ్చి బాగా పింఛను ఇస్తా వుండే పాపం. ఇప్పుడు ఇవ్వకూడదంట. ఎందుకయ్యా.. బాగా పని చేసే వాళ్లని చేయనీకుండా ఇట్టా అడ్డుకుంటారు. ఇదంతా చేసింది చంద్రబాబు, పవనకల్యాణే అంట కదా. టీవీల్లో వచ్చే వార్తల్లో చెప్తావుండారు. వలంటీర్ల చేత పనులు చేయనీకుండా అడ్డుకోడం అన్యాయం. ఈ పాపం ఊరికే పోదులే. కచ్చితంగా అనుభవిస్తారు. జగన్ బాబు వచ్చిన తర్వాత పింఛనుతో పాటు అన్ని పథకాలు బాగా అందిస్తా ఉండారు. ఎవరెంత మంచి చేస్తారో వాళ్లకే దేవుడు మంచి చేస్తాడు. బాగా పని చేసేవాళ్లకే జనం ఓట్లేస్తారు. చంద్రబాబు హయాంలో ఆఫీస్ కాడ రోజులు పాటు కాసుక్కూచ్చున్నా నా భర్తకి పింఛను వచ్చేది కాదు. నా భర్త పోయిన తర్వాత నాకు పింఛను ఇచ్చారు. నాకు వయసు మీరింది. అనారోగ్యంతో మంచం పట్టాను. యా ఆఫీస్ కాడికీ పోకుండానే ఒకటో తేదీ తెల్లారికే నా ఇంటికే పింఛను వస్తా ఉండేది. ఆ డబ్బులతోనే ఇల్లు గడిచేది, నాకు మందులుకు బాగా అవసరపడేది. ఇప్పుడేమో రెండు రోజులు కావస్తున్నా ఇంకా పింఛన్ రాలేదు. ఏమి చేసేది. చంద్రబాబు మనుషులు ఓట్లు కోసం ఇంటికాడికి రానీ అప్పుడు చెప్తా వాళ్ల సంగతి. **- రాజమ్మ, పత్తికొండ**

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

రామకుప్పం : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగికదాడికి యత్నించిన ఇద్దరు యువకులపై పోలీసులు పోక్సో చట్టం కింద మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. తమిళనాడులోని ఓ గ్రామానికి చెందిన బాలిక (13) తల్లిదండ్రులు పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అప్పటి నుంచి రామకుప్పం మండలంలోని ఓ గ్రామంలో బాలిక తన పిన్ని వద్ద ఉంటూ చదువుకుంటోంది. సోమవారం సాయంత్రం పక్క గ్రామంలోని దుకాణంలో తమ్ముడికి తినుబండారాలు తీసుకురావడానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా బాలికను అదే గ్రామానికి చెందిన శేఖర్ (20), ధనశేఖర్ (20) వెంబడిస్తూ వచ్చి లైంగికదాడికి యత్నించారు. బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. జరిగిన ఘటనను బాలిక కుటుంబ సభ్యులకు తెలిపింది. విషయం అందరికీ తెలియడంతో ధనశేఖర్ సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలిక పినతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శేఖర్, ధనశేఖర్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన హరిప్రసాద్



అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ ఇన్‌చార్జి హరిప్రసాద్ - తంబళ్లపల్లె

పింఛన్లపై రాజకీయాలు దారుణం



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం : సామాజిక పింఛన్ల పంపిణీపై రాజకీయాలు చేయడం దారుణమని, నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ మండిపడ్డారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ప్రజల అభిమానం పొందాలంటే మంచి చేయాలని , ఇలా అవ్వాతాతలకు వస్తున్న పింఛన్లను అడ్డుకోవడం సరికాదని తెలిపారు. వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు మొదటి నుంచి విమర్శలు చేసేవారని, గోనె సంచులు మోసే ఉద్యోగమంటూ హేళన చేసేవారని ఆరోపించారు. ఇప్పుడేమో నిమ్మగడ్డ రమేష్ ద్వారా తప్పుడు ఫిర్యాదులు చేయించి పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత రావడంతో అంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేయిస్తున్నారని అసత్య ప్రచారానికి తెగబడ్డారని విమర్శించారు. ఐదేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేయిస్తున్న జగనన్న ఇప్పుడు పెన్షనర్లను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించడం హాస్యాస్పదమని తెలిపారు. అధికారం కోసం నైతిక విలువలను వదిలేసిన చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, కుప్పంలోనూ చంద్రబాబుకు ఓటమి తప్పదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే పిఠాపురంలో పవన్ కల్యాణ్, మంగళగిరిలో లోకేష్ ఓడిపోవడం తథ్యమని వెల్లడించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపడతారని తెలిపారు. సమావేశంలో పార్టీ మండలం కన్వీనర్ మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి



ఆకాష్ (ఫైల్)



సంతోష్ (ఫైల్)

చిత్తూరు రూరల్: ఈత కెళ్లిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన మంగళవారం చిత్తూరు మండలం పచ్చనపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కుప్పయ్య కుమారుడు ఆకాష్ (15) పదో తరగతి పూర్తిచేశాడు. అదే గ్రామానికి చెందిన త్యాగరాజులు కుమారుడు సంతోష్ (14) 9వతరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వీరు ఇద్దరు కలిసి గ్రామ సమీపంలోని అరతల చెరువుకు ఈతకెళ్లారు. ప్రమాదవశాత్తు మునిగిపోయారు. అక్కడే చేపలు పడుతున్న ఓ వ్యక్తి వెంటనే చెరువులోకి దిగి సంతోష్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చాడు. ఆకాష్ మృతదేహం బురదలో కూరుకుపోవడంతో గ్రామస్తుల సాయం తీసుకుని వెలికితీశారు. ఇద్దరు పిల్లల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యార్థుల కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోయాయి.

నగదు తీసుకెళ్లాలంటే.. సరైన పత్రాలు ఉండాల్సిందే!

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరైన ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లడానికి వీల్లేదు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదని స్పష్టం చేస్తున్నారు. అంతకంటే ఎక్కువ నగదుతో పట్టుబడితే అధికారులు సీజ్ చేస్తారని చెబుతున్నారు. ఈ మేరకు అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లి, ఇతర అవసరాలకు నగదు తీసుకెళ్లే వారు సరైన పత్రాలను వెంట పెట్టుకుని వెళ్లాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు. నగదు డ్రా చేసిన అకౌంట్ పాస్ పుస్తకం, ఏటీఎం చీటీ, వస్తువులు, విక్రయాలు అయితే బిల్లు, భూమి విక్రయించిన సొమ్ము అయితే డాక్యుమెంట్లు, వ్యాపారం, సేవల నగదు అయితే లావాదేవీల వివరాలు చూపించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. అయితే సీజ్ చేసిన నగదుకు సంబంధించి ఆధారాలను సమర్పించేందుకు జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి జెడ్పీ సీఈఓ గ్లోరియా (హెడ్)–9491071321, కన్వీనర్‌గా జిల్లా ఆడిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి– 8328399024, ట్రెజరీ డీడీ రామచంద్రారెడ్డి– 9848778494ని సంప్రదించవచ్చని తెలియజేస్తున్నారు.

కూటమికి తప్పదు ఓటమి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆర్‌కే సెల్వమణి

నగరి : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటమి తప్పదని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని సత్రవాడ దళితవాడలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించే కరపత్రాలను అందించారు. తాము ఉత్తుత్తి హామీలు ఇవ్వమని, మాట ఇస్తే నెరవేరుస్తామన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రతి కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే ఓటేయమన్న దమ్మున్న నాయకుడు జగనన్న అని కొనియాడారు. మీ ఇంటి బిడ్డ రోజమ్మకు మద్దతుగా అందరూ నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీఆర్‌వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మురుగా, ఇంద్రయ్య, అయ్యప్ప, మేషాక్, దినకర్, రమేష్ పాల్గొన్నారు.

నృత్యం.. వినూత్నం!



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టుకు విచ్చేయనున్నారు. ఈ మేరకు ముందుస్తుగా ఆయనకు స్వాగతం పలుకుతూ చిత్తూరులోని గాంధీవిగ్రహం వద్ద భరతనాట్యం ఫ్లాష్‌మాబ్‌ను విన్నూతంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రచార పాటలకు పిల్లలు అద్భుతంగా నృత్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా జగనన్నను గెలిపించుకోవడానికి మేమంతా సిద్ధం అంటూ అభిమానులు జెండాలు చేతపట్టారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి కార్యక్రమానికి హాజరై కళాకారులకు బహుమతులు పంపిణీ చేశారు. నాయకులు అంజలిరెడ్డి, హరిణిరెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు కార్పొరేషన్



స్వాగతం - సుస్వాగతం
మేమంతా సిద్ధం!
నేడు పూతలపట్టు నియోజకవర్గానికి
మేమంతా సిద్ధం
బస్సు యాత్ర కు
మరియు భారీ బహిరంగ సభ కు
విచ్చేయుచున్న మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.యస్.జగన్ మోహన్ రెడ్డి గారికి
మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ...
నేడు జరుగు బహిరంగ సభకు వై.యస్.ఆర్.సీ.పీ.
కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని సభను
విజయవంతం చేయవలసిందిగా ప్రార్థన..
డా॥ సునీల్ కుమార్
పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి
బి. ధనంజయ రెడ్డి
జడ్.పి. వైస్ చైర్మెన్.,
వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు,
యాదమరి (మం)
బి. మోహన్ రెడ్డి
బి.యం.ఆర్. అధినేత,
ప్రముఖ పారిశ్రామిక వేత్త

క్లుప్తంగా

సీఎంను కలిసిన జెడ్పీ చైర్మన్



పలమనేరు: 'మేమంతా సిద్ధం' మదనపల్లె సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కుమ్మరి శాలివాహన ఆత్మీయ సమావేశం



కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తంను సన్మానిస్తున్న సభ్యులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం దేవళంపేటలో మంగళవారం కుమ్మరి శాలి వాహన ఆత్మీయ సమావేశం చిత్తూరు కుమ్మరి బీసీ వెల్ఫేర్ సభ్యులు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కుమ్మరులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తంను సన్మానించారు. కార్యక్రమంలో రవికుమార్, వేణుగోపాల్, చంద్రబాబు, సురేష్, మల్లిఖార్జున, శివ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏ.నరేంద్రరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ కొళత్తూరుకు వెళ్లి నరేంద్రరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతోపాటు పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ మార్కొండయ్య, మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్రబల్లి శ్రీనివాసులు, పార్టీ నాయకులు సురేష్, ఓబుల్‌రెడ్డి, గోపి నివాళులర్పించారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి విశేషాలంకరణ చేసి, మొక్కుకుంటున్న భక్తులు



అంబలి, పూజాసామగ్రితో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజు పురం పంచాయతీ ఏటుకూరిపల్లెలో ఉన్న బాట గంగమ్మకు గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి, అంబళ్లు పోశారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలి సామగ్రితో వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లారు. మధ్యాహ్నం పాలబిందెలను మహిళలు గ్రామంలో ఊరేగించి, తీసుకు వెళ్లి, అమ్మవారికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అంబలి పోశారు. తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

రామచంద్రాపురం: ప్రతిఒక్కరూ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని స్థానిక ఎస్‌ఐ చిరంజీవి అన్నారు. మంగళవారం మండలంలోని పరమాల, కొత్తకండ్రిగ కుప్పంబాదూరు, రాయలచెరువుపేట, గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సురేష్, ధన, త్యాగ, రమణ, యోబు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెరిగిన ఉపాధి వేతనాలు



ఎగువ తవణంపల్లె వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



కంపలపల్లె వద్ద సప్లై చానల్లో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధిలో పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం
- మండలంలో 64 రకాల పనులు
- 4,588 కుటుంబాలకు ఉపాధి పనులు

తవణంపల్లె: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పనులు చేసే కూలీలకు వేతనాలు పెరిగాయి. దీనితో ఉపాధి పనులు చేపట్టే కూలీలకు ఊరట కలిగింది. జాబ్‌కార్డులు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలన్నది ఈ పథకం ఉద్దేశం. మండలంలో 6,337 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 4,588 కుటుంబాలు మాత్రం పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఉపాధి పథకం కింద వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పాటు ఉపాధి కూలీలకు అనువైన పనులను గుర్తించి పనులు చేపడుతున్నారు. వేసవి కాలంలో ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనాలు ఏటా పెంచుతున్నారు. కానీ ఈ ఏడాది రూ.272ల నుంచి రూ.300లకు వేతనాలు పెంచారు.

వడదెబ్బకు తగలకుండా జాగ్రత్తలు

వేసవి దృష్ట్యా ఉపాధి కింద పనులు చేపట్టే కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఉపాధి అధికారులు సూచించారు. చెరువుల్లో, గుట్టల్లో పనులు చేసే కూలీలకు నీడ ఏర్పాటు చేయాలని ఫీల్డు అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్సను కిట్లకు ఏర్పాటు చేశారు. వడ దెబ్బకు గురికాకుండా ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు పనులు చేయాలని సూచించారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

ప్రభుత్వం ఉపాధి పథకం కింద 2024 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల వ్యవసాయ పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం కల్పించారు. మండలంలో ప్రస్తుతం సప్లై చానల్లో పూడిక తీత, రైతు పొలాల్లో సరిహద్దు కందకాలు తవ్వకాలు, చెరువుల్లో చేపలు పెంపకానికి ఫాండ్స్ తవ్వకాలు, మామిడి తోటల్లో పాదులు తీయుట, అడవుల్లో ట్రెంచ్‌లు ఏర్పాటు చేసే పనులు భారీగా చేపడుతున్నారు.

వేతనాలు పెంచడం సంతోషం



ఎండలో పని చేసే కూలీలకు ప్రభుత్వం వేతనాలు పెంచడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం రోజుకు కూలీ రూ.300 మించకుండా పెంచారు. ప్రభుత్వం కూలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.

-జ్యోతి, ఉపాధి కూలీ, ఎగువ తవణంపల్లె

నీడ ఏర్పాటు చేయాలి



ఎండలో పనులు చేసే కూలీలకు నీడ ఏర్పాటు చేయాలి. ఎండలో పనులు చేసే కూలీలు సేద దీరడానికి నీడ లేక అవస్థలు పడుతున్నారు. ఉపాధి అధికారులు చర్యలు తీసుకోవాలి

-దేవకుమార్, ఉపాధి కూలీ, ఎగువ తవణంపల్లె

సకాలంలో బిల్లులు చెల్లించాలి



ఉపాధి హామీ పథకం కింద పూర్తి చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి. ఉపాధి పనులపై ఆధారపడి పనులు చేసే కూలీలకు కుటుం అవసరాల నిమిత్తం బిల్లులు తొందరగా చెల్లించాలి.

-నవీన్, ఉపాధి కూలీ, ఎగువ తవణంపల్లె

మోడల్ స్కూల్‌లో ఇంటర్ తరగతులు



నూతనంగా ప్రారంభించిన మోడల్ స్కూల్ హాస్టల్ భవనం

రొంపిచెర్ల: రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ మీడియెట్ తరగతులు ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపల్ సరళ మంగళవారం తెలిపారు. తరగతి గదుల కొరత కారణంగా గత మూడేళ్లుగా ఇంటర్ తరగతులను ప్రారంభించలేదని, ఇప్పుడు హాస్టల్ భవన నిర్మాణం పూర్తి కావడంతో తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులలో ప్రవేశానికి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో మే నెల 22 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అనుభవం, ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయనున్నట్టు పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రం దరఖాస్తు చేయనవసరం లేదన్నారు. విద్యార్థులు సాధించిన మార్కులు ఆధారంగా సీటు కేటాయిస్తామన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటా ఎన్నికల ప్రచారం



అనంతాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

చిత్తూరు రూరల్: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు అభ్యర్థించారు. చిత్తూరు మండలం అనంతాపురం పంచాయతీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను తెలియజేశారు. వైఎస్సార్ సీపీని గెలిపిస్తే రాష్ట్ర భవిష్యత్‌కు ఢోకా ఉండదని, అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కరపత్రాలు అందజేసి కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సంపత్, పాండియన్, భాస్కర్‌నాయుడు, భాస్కర్, రాబర్ట్, దిలీప్, పరంధామనాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

హుండీని పగలగొట్టిన దుండగులు

పాకాల: గుర్తు తెలియని దుండగులు శ్రీకామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీని పగలగొట్టిన సంఘటన సోమవారం రాత్రి మణిపిరెడ్డిపల్లికి సమీపంలో చోటుచేసుకుంది. మంగళవారం ఆలయ ధర్మకర్త కె.సంపూర్ణంపిళ్లై మాట్లాడుతూ రోజూ మాదిరిగానే ఉదయం 4.30 గంటలకు ఆలయం వద్దకు వెళ్లగా ఆలయం ప్రధాన గేటుకు వేసిన తాళాలు పగలగొట్టి కింద పడేసి ఉన్నారు. అలాగే హుండీ తాళాలు కూడా పగలగొట్టి ఉండడాన్ని గమనించినట్లు పేర్కొన్నారు. ఆలయ హుండీలో రూ.10వేల వరకు ఉంటాయని తెలిపారు. అనంతరం ఆలయానికి సమీపంలో నివాసం ఉంటున్న తన కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు పుష్పయాగానికి అంకురార్పణ

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగానికి బుధవారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహించనున్నారు. ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల కారణంగా తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాగం నిర్వహణతో సమస్తదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. ఇందులో భాగంగా ఏప్రిల్ గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. శ్రీవారి పుష్పయాగాన్ని పురస్కరించుకుని బుధవారం జరగాల్సిన అష్టోత్తర శతకలశాభిషేకం, గురువారం నిర్వహించాల్సిన తిరుప్పావడ, నిత్య కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

రథోత్సవం



గుడుపల్లె: మండలంలో కనమనపల్లెలోని శ్రీ పద్మావతీ శ్రీనివాసస్వామి ఆలయంలో శ్రీనివాసుని రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పది రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో స్వామి వారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే రథాన్ని రంగు రంగుల వస్త్రాలు, పూలతో ముస్తాబు చేశారు. వేదపండితులు ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి, భక్తుల గోవింద నామస్మరణ నడుమ రథోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో దోపోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది

పాలసముద్రం: వేసవిలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు ఆశా నోడల్ అధికారి సుశీల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, ఉష్ణోగ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున ఎండ ఉన్న సమయంలో బయటకు రాకూడదన్నారు. అత్యవసరంగా బయటకు రావాల్సి వస్తే ఎండ తగలకుండా గొడుగు, ముఖానికి వస్త్రం ధరించి వెళ్లాలని సూచించారు. నీరు, చల్లని పానీయాలు ఎక్కువగా తీసుకోవాలని, వడదెబ్బకు గురైనట్టు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవం చేసుకోవాలన్నారు. అనంతరం వడదెబ్బ నివారణపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపరవైజర్ మురళి పాల్గొన్నారు.

సేవా కర్‌నేకా ఏక్ మోకా దేదో



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లిం మహిళలు

- ముస్లిం మహిళలను అభ్యర్థించిన ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ
- తొలిసారి ముస్లిం మహిళల ఇఫ్తార్ విందు
- అంచనాలకు మించి విశేష స్పందన కుప్పం నియోజకవర్గ చరిత్రలో ఇదో సరికొత్త ఒరవడి



దుర్గతో సెల్ఫీలు తీసుకుంటున్న ముస్లిం మహిళలు

రామకుప్పం: 'హమ్ లోగోంకో సేవా కర్‌నేకా ఏక్ మోకా దేదో ఆప్ సబ్‌కేలియో హమ్ కడేహోంగే..ఆప్‌కే జరూరత్ మై మేరా పతి 100 పర్సెంట్ కడేంగే..మే వాదా దేతీ హూ..ఆప్ రంజాన్ కా ఈదీ దేనా పడేగా..ఏ సాల్ మేరా పతీకో ఆశీర్వాద్ దేనా!'(మీకు సేవ చేసేందుకు ఒక అవకాశం ఇవ్వండి. మీకు అండగా నిలబడతాం. నేను, నా భర్త భరత్ మీకు 100 శాతం అండగా ఉంటాం. నేను మీకు మాట ఇస్తున్నాను. మీరందరూ రంజాన్ కానుక ఇవ్వాలి.. ఈసారి ఎన్నికల్లో నా భర్తను ఆశీర్వదించండి) అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ముస్లిం మహిళలను అభ్యర్థించారు. మంగళవారం రామకుప్పంలోని ఓ ప్రైవేటు హాలులో మహిళల ఆత్మీయ ఇఫ్తార్ విందుకు దుర్గ హాజరయ్యారు. మండల వ్యాప్తంగా 1,300 మంది పైచిలుకు ముస్లిం మహిళలు హాజరయ్యారు. వారితో దుర్గ ఉర్దూలో మాట్లాడడంతో సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. రంజాన్ పవిత్ర మాసం ప్రత్యేకత, ముస్లింల నియమ నిష్ఠల గురించి దుర్గ తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. ఆకలితో అలమటించే ప్రజల బాధలు తెలుసుకోవడానికి, అల్లాహ్‌ను ప్రార్థించడానికి ఉపవాస దీక్షలు చేస్తారని, ఎవరూ ఆకలితో అలమటించకూడదని, అందరికీ దానధర్మాలు చేయాలని ప్రవక్త అల్లాహ్ ప్రబోధించారని, ఇది అందరికీ అనుసరణీయం కావాలని ఆమె అన్నారు. రంజాన్ పండుగ కోసం చిన్నప్పుడు తానెంతగానో ఎదురు చూసేదానినని, తన ముస్లిం స్నేహితురాళ్ల ఇంట సందడి చేసేదానిని చెప్పారు. ఇక్కడ ముస్లిం మహిళలతో గడపడంతో 'రంజాన్' బాల్య స్మృతులు సినిమా రీల్స్‌లా కళ్లలో రీవైండ్ అవుతున్నాయంటూ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఇంతమంది మహిళల మధ్య గడపడం తనకు ఇదో మధురానుభూతిగా మిగులుతుందన్నారు.

హమారా ఆశీర్వాద్ మిలేగా బేటీ!

'ఆప్‌నే బహుత్ అచ్చా బోలా. తుమ్ భీ హమారే బేటీకే తరహ్ హో. తుమ్‌హే హమేషా హమారా ఆశీర్వాద్ మిలేగా బేటీ (నువ్ చాలా బాగా మాట్లాడావమ్మా. నువ్వు కూడా మాకు బిడ్డలాంటి దానివే. మా అందరి ఆశీస్సులు నీకు ఉంటాయమ్మా!)'అని ముస్లిం మహిళలు దుర్గను ఆశీర్వదించారు. దుర్గ తమను ఆత్మీయంగా కలిసి మాట్లాడిన తీరు తమకెంతో నచ్చిందని, గతంలో ఎవరూ తమను ఇలా కలవలేదని ముస్లిం మహిళలు తెలిపారు. అంతేకాకుండా ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు, కుప్పం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బర్కతుల్లా, మైనారిటీ నేతలు తన్విద్, తజీముల్ బాషా, జబివుల్లా, అబ్దుల్, నయాజ్, ఏజెస్, అప్పా, షమీవుల్లా ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో భక్తులు

సదుం: మండలంలోని పాపిరెడ్డిగారిపల్లెలో నూతన ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, క్షీరాధివాసం, జలాధివాసం, హోమాలు, గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు.

క్లుప్తంగా

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీకి రూపొందించిన కార్డులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని 50 డివిజన్లలో బుధవారం నుంచి అన్ని సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు వారికి కేటాయించిన సమయంలో మాత్రమే సచివాలయం వద్దకు రావాలని కోరారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలల పాటు పంపిణీ చేసే పింఛన్ల కోసం లబ్ధిదారులకు కొత్తగా కార్డులను సైతం ముద్రించామని, వీటిని సచివాలయాల వద్ద అందజేస్తామని పేర్కొన్నారు. చిత్తూరులో 16,697 మంది లబ్ధిదారులున్నారని, వీరికి సచివాలయ కార్యదర్శుల ద్వారా పింఛన్ల పంపిణీ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుల నియామకం

పూతలపట్టు(చిత్తూరు రూరల్): ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, అదనపు పరిశీలకులను నియమించినట్లు మంగళవారం పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పలమనేరుకు చెందిన సీవీ కుమార్‌ను పరిశీలకులుగా, అదనపు పరిశీలకులుగా శైలజా చరణ్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొంది.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి



జగదీశ్వర్ పిళ్లై (ఫైల్)

బంగారుపాళెం: మొగిలి మిట్టూరులో నివాసమున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు జగదీశ్వర్‌పిళ్లై మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుని స్వగ్రామంలో జగదీశ్వర్‌పిళ్లై భౌతికకాయాన్ని పలువురు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లోకేష్

బంగారుపాళెం: ఆశా వర్కర్లు గ్రామాల్లో ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ లోకేష్, పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మంగళవారం ఆశా డే సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజలు జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఆశా వర్కర్లు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్వో చిన్నయ్య

తవణంపల్లె: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని చిత్తూరు ఆర్డీఓ, పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.చిన్నయ్య ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కాణిపాకం హైవే బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని 15 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ రెడ్డిబాబు, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, బీఎల్వోలు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

నేడు సదుంలో సీఎం రోడ్‌షో

సదుం: మండలంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా రోడ్‌షో నిర్వహించనున్నారు. అమ్మగారిపల్లె బేస్ క్యాంపు నుంచి ఆయన పర్యటన ప్రారంభమై మండల కేంద్రంతో పాటు భట్టువారిపల్లె, గొడ్లవారిపల్లె, బూరగమంద క్రాస్ మీదుగా ఆయన రోడ్‌షో సాగి అనంతరం పులిచెర్ల మండలంలోకి ఆయన యాత్ర ప్రవేశించనుంది. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

మా ఉసురు తగులుతుంది బాబూ

ఇన్నాళ్లూ ఒకటో తేదీనే ఇంటికొచ్చి వలంటీర్లు పింఛన్లు ఇచ్చి వెళ్లేవాళ్లు. ఈనెల నుంచి వలంటీర్లు ఇచ్చేదానికి వీల్లేదంట. చంద్రబాబే దీనికి కారణమని చెబుతున్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు పింఛన్ల కోసం ఎన్ని బాధలు పడినామో!..జగను వచ్చినాక ఆ బాధలన్నీ తీర్చినాడు. వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్లు ఇస్తాంటే చంద్రబాబుకు ఎందుకో ఇంత కడుపుమంట? ఆయనకు మా ఉసురు తగులుతుంది అనినియోజకవర్గంలోని పలువురు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు శాపనార్థాలు పెడుతున్నారు.

ఈ పాపం ఊరికే పోదు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిలా ఒకటో తేదీ ఇంటి తలుపు తట్టి వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తే ఎన్నికలను అడ్డుపెట్టుకుని అడ్డుకున్నావు. ఈ పాపం ఊరికే పోదు. ఈ ఎన్నికల్లో నీకు తగిన బుద్ధి చెబుతాం. ఈ పాడు ఆలోచన మానుకోవాలి.

–మోహన్, నడింపల్లె





నేను మంచం నుంచి లేవలేను

రాజకీయాలకోసం మాలాంటి వారికి వలంటీర్ల ద్వారా అందించే పింఛన్ నిలిపివేడడం తప్పు. నేను మంచం నుంచి కదల్లేను. సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోవాలి. టీడీపీ, జనసేన పార్టీలు మమ్మల్ని ఇబ్బందులు పెట్టేందుకే ఇలా చేయించారు. జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవారు. మమ్మల్ని ఇబ్బంది పెడుతున్న పార్టీలకు మా ఉసురు తగులుతుంది.

–అర్షాద్, బంగారుపాళెం



నీ పాలనలో పడిగాపులు కాశాం

నీ పాలనలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాశాం. జగన్ వల్ల మాకు ఇంటికే పింఛన్ వచ్చేది. ఈ నెలలో నీ పుణ్యమా అని సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. వలంటీర్ల సేవలను మరచిపోలేం. మా ఉసురు నీకు తగులుతుంది.

–బాలకృష్ణయ్య, దిగువమోదలపల్లె



నీ పాలనలో ఇబ్బందులు పడ్డాం

గతంలో నీ పాలనలో పింఛన్ల కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం చంద్రబాబూ. బిడ్డలాంటి జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాత పింఛనుదారుల కష్టాలు తీరాయి. మళ్లీ మాకు కష్టాలు తెచ్చిపెట్టావు. మా ఉసురు నీకు తగులుతుంది.

–సులోచనమ్మ, సి.వి.పల్లె



మా ఇబ్బందులు పట్టవా..

నేను అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వల్ల ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చారు. చంద్రబాబు వల్ల ఇప్పుడేమో గ్రామ సచివాలయం వద్ద ఇస్తారంట. అంత దూరం వెళ్లి పింఛన్ తెచ్చుకోలేను. మాకు అండగా నిలిచిన వలంటీర్లను విధులకు దూరం చేశారు. వలంటీర్లపై ఫిర్యాదు చేసిన చంద్రబాబుకు మా ఇబ్బందులు పట్టవా.

–చిట్టెమ్మ, బంగారుపాళెం



పింఛన్ ఎలా తెచ్చుకోవాలి?

జగన్‌మోహన్‌రెడ్డి వల్ల వలంటీరు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛను ఇచ్చేవారు. చంద్రబాబు వల్ల ఈ నెల నుంచి సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంట. మాలాంటి దివ్యాంగులకు ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబుకు కక్షసాధింపు తగదు.

–సురాజ్, బంగారుపాళెం



పింఛన్లపై రాజకీయం ఎందుకు బాబూ..?

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ పంపిణీ చేసే పింఛన్లపై ఎందుకు రాజకీయం చేసేది చంద్రబాబు. గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. పింఛన్ల పంపిణీపై కక్ష పూరితంగా వ్యవహరించడం వల్ల నీకు ఏమి జరుగుతుందో ఎన్నికల తర్వాత తెలుసుకుంటావు.

–చిన్నమ్మ, దిగువ మోదలపల్లె

పిచ్చాపా‘టీ’!

వచ్చెరా ఎలక్షన్
మెచ్చగ రారా బాంచెన్
‘ఫ్యాను’ విజయమే వరింపన్



స్థానికులతో టీ తాగుతూ ముచ్చటిస్తున్న విజయానందరెడ్డి

అనే లెవెల్లో విజయానందరెడ్డెన్న ఓటర్లతో పిచ్చాపా‘టీ’గా ముచ్చటించారు. మంగళవారం ఉదయాన్నే చిత్తూరు వైఎస్సార్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ‘గుడ్ మార్నింగ్ అన్నా’ అంటూ స్థానిక సంతపేట కూడలి, అంబేడ్కర్ విగ్రహం ప్రాంతాల్లోని టీ స్టాల్స్ వద్ద స్థానికులతో ముచ్చటించారు. అక్కడే కూర్చున్న ఆయన.. మంచి స్ట్రాంగ్ టీ వేయన్నా? అని కోరడంతో టీ దుకాణ యజమాని అందరికీ పొగలు కక్కేలా వేడి..వేడిగా టీ ఇచ్చారు. ఇక ఆయన టీ తాగుతూ..ఏమన్నా ఎలా ఉన్నావు? పిల్లలు ఏమి చేస్తున్నారు? స్థానికంగా సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఏయే ప్రభుత్వ పథకాల సాయం పొందారు? అని అడిగి తెలుసుకున్నారు. పేద, మధ్య తరగతి వారు కుటుంబ, సామాజిక, రాజకీయ అంశాలకు వేదిక టీ స్టాల్స్, చిల్లర అంగళ్లేనని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థినీ గెలిపించాలని కోరారు. గెలిపిస్తే సంతపేటలో నవోదయ పాఠశాల ఏర్పాటు, డంపింగ్ యార్డు తరలింపు, మురకంబట్టు–సంతపేట రోడ్డు మరమ్మతు, మంగసముద్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట నగర పార్టీ అధ్యక్షులు జ్ఞాన జగదీష్ నాయకులు అప్పోజీ, సీకే ద్వారక, నారాయణ ఉన్నారు.

–చిత్తూరు కార్పొరేషన్

గుడిపాలలో ‘ఫ్యామిలీ డాక్టర్’





గుడిపాల: రోగులను పరీక్షిస్తు, డాక్టర్ చంద్రమహేష్, వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

గుడిపాల: ఇళ్ల ముంగిటకే అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమహేష్ కోరారు. మంగళవారం గుడిపాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి రోగులకు బీపీ, షుగర్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది సోనియా, చంద్ర, సింధు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత కోరారు. గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి విగ్రహావిష్కరణ చేశారు. పూర్వ విద్యార్థి పాండియన్ తన సొంత ఖర్చుతో ఈ విగ్రహాన్ని తయారు చేయించి ఇచ్చారని ప్రధానోపాధ్యాయుడు రమేష్ తెలిపారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, నాయకులు వేలుస్వామి పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎంసీఎంసీ కమిటీ బాధ్యతగా వ్యవహరించాలి


- చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు



ఎంసీఎంసీ కేంద్రంలో మాట్లాడుతున్న చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ బాధ్యతగా వ్యవహరించి విధులు నిర్వర్తించాలని చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రాజకీయ ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. పత్రికల్లో, న్యూస్ చానల్స్, సోషల్ మీడియాల్లో వచ్చే ప్రకటనలను నిత్యం పరిశీలించాలన్నారు. విధుల పట్ల ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. రాజకీయ పార్టీలు ప్రకటనలకు సంబంధించి తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతి పొందాలన్నారు. రాజకీయపార్టీల ప్రచారాలు, ప్రకటనల నిమిత్తం నిర్ణీత ఫార్మెట్‌లో తేదీ, సమయం, ఏ చానల్, ఏ పార్టీ వంటి వివరాలు తయారు చేసి నోడల్ అధికారికి అందజేయాలన్నారు. ఆ తర్వాత కమిటీ పరిశీలించి అనుమతులు ఇస్తుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు పెయిడ్ న్యూస్ సంబంధిత పార్టీల ఖాతాల్లో, ఆ తర్వాత అభ్యర్థుల ఖాతాలకు జమ చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంసీఎంసీ నోడల్ అధికారి నాగేశ్వర రావు, ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ, డీఎల్‌పీఆర్‌ఓ రమణ పాల్గొన్నారు.

నేడు పూతలపట్టుకు సీఎం రాక



సభా ప్రాంగణం

పూతలపట్టు: మేము సిద్ధం బస్సు యాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి రానున్నారు. ముందుగా మండలంలోని పాటూరు నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు రంగంపేట క్రాస్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. గోపాలకృష్ణాపురం సమీపంలో జరిగే సభలో సీఎం పాల్గొననున్నారు. మంగళవారం సభా ప్రాంగణ ఏర్పాట్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సీఎం బహిరంగ సభను పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రికి తేనెపల్లి టోల్ ప్లాజా సమీపంలో భోజన వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబు రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ చైర్మన్ శైలజాచరణ్ రెడ్డి, నేతలు మోహన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



సిద్ధమైన సభా ఆవరణం

మా ఉసురు తగులుతుంది బాబూ

ఇన్నాళ్లూ ఒకటో తేదీనే ఇంటికొచ్చి వలంటీర్లు పింఛన్లు ఇచ్చి వెళ్లేవాళ్లు. ఈనెల నుంచి వలంటీర్లు ఇచ్చేదానికి వీల్లేదంట. చంద్రబాబే దీనికి కారణమని చెబుతున్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు పింఛన్ల కోసం ఎన్ని బాధలు పడినామో!..జగను వచ్చినాక ఆ బాధలన్నీ తీర్చినాడు. వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్లు ఇస్తాంటే చంద్రబాబుకు ఎందుకో ఇంత కడుపుమంట? ఆయనకు మా ఉసురు తగులుతుంది అనియోజకవర్గంలోని పలువురు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు శాపనార్థాలు పెడుతున్నారు.



నేను మంచం నుంచి లేవలేను

రాజకీయాలకోసం మాలాంటి వారికి వలంటీర్ల ద్వారా అందించే పింఛన్ నిలిపివేడడం తప్పు. నేను మంచం నుంచి కదల్లేను. సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోవాలి. టీడీపీ, జనసేన పార్టీలు మమ్మల్ని ఇబ్బందులు పెట్టేందుకే ఇలా చేయించారు. జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవారు. మమ్మల్ని ఇబ్బంది పెడుతున్న పార్టీలకు మా ఉసురు తగులుతుంది.

–అర్షాద్, బంగారుపాళెం



నీ పాలనలో ఇబ్బందులు పడ్డాం

గతంలో నీ పాలనలో పింఛన్ల కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం చంద్రబాబూ. బిడ్డలాంటి జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాత పింఛనుదారుల కష్టాలు తీరాయి. మళ్లీ మాకు కష్టాలు తెచ్చిపెట్టావు. మా ఉసురు నీకు తగులుతుంది.

–సులోచనమ్మ, సి.వి.పల్లె

పింఛన్ ఎలా తెచ్చుకోవాలి?

జగన్‌మోహన్‌రెడ్డి వల్ల వలంటీరు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛను ఇచ్చేవారు. చంద్రబాబు వల్ల ఈ నెల నుంచి సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంట. మాలాంటి దివ్యాంగులకు ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబుకు కక్షసాధింపు తగదు.

–సురాజ్, బంగారుపాళెం



ఈ పాపం ఊరికే పోదు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిలా ఒకటో తేదీ ఇంటి తలుపు తట్టి వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తే ఎన్నికలను అడ్డుపెట్టుకుని అడ్డుకున్నావు. ఈ పాపం ఊరికే పోదు. ఈ ఎన్నికల్లో నీకు తగిన బుద్ధి చెబుతాం. ఈ పాడు ఆలోచన మానుకోవాలి.

–మోహన్, నడింపల్లె





నీ పాలనలో పడిగాపులు కాశాం

నీ పాలనలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాశాం. జగన్ వల్ల మాకు ఇంటికే పింఛన్ వచ్చేది. ఈ నెలలో నీ పుణ్యమా అని సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. వలంటీర్ల సేవలను మరచిపోలేం. మా ఉసురు నీకు తగులుతుంది.

–బాలకృష్ణయ్య, దిగువమోదలపల్లె





మా ఇబ్బందులు పట్టవా..

నేను అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వల్ల ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చారు. చంద్రబాబు వల్ల ఇప్పుడేమో గ్రామ సచివాలయం వద్ద ఇస్తారంట. అంత దూరం వెళ్లి పింఛన్ తెచ్చుకోలేను. మాకు అండగా నిలిచిన వలంటీర్లను విధులకు దూరం చేశారు. వలంటీర్లపై ఫిర్యాదు చేసిన చంద్రబాబుకు మా ఇబ్బందులు పట్టవా.

–చిట్టెమ్మ, బంగారుపాళెం

పింఛన్లపై రాజకీయం ఎందుకు బాబూ..?

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ పంపిణీ చేసే పింఛన్లపై ఎందుకు రాజకీయం చేసేది చంద్రబాబు. గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. పింఛన్ల పంపిణీపై కక్ష పూరితంగా వ్యవహరించడం వల్ల నీకు ఏమి జరుగుతుందో ఎన్నికల తర్వాత తెలుసుకుంటావు.

–చిన్నమ్మ, దిగువ మోదలపల్లె

క్లుప్తంగా

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీకి రూపొందించిన కార్డులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని 50 డివిజన్లలో బుధవారం నుంచి అన్ని సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు వారికి కేటాయించిన సమయంలో మాత్రమే సచివాలయం వద్దకు రావాలని కోరారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలల పాటు పంపిణీ చేసే పింఛన్ల కోసం లబ్ధిదారులకు కొత్తగా కార్డులను సైతం ముద్రించామని, వీటిని సచివాలయాల వద్ద అందజేస్తామని పేర్కొన్నారు. చిత్తూరులో 16,697 మంది లబ్ధిదారులున్నారని, వీరికి సచివాలయ కార్యదర్శుల ద్వారా పింఛన్ల పంపిణీ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుల నియామకం

పూతలపట్టు(చిత్తూరు రూరల్): ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, అదనపు పరిశీలకులను నియమించినట్లు మంగళవారం పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పలమనేరుకు చెందిన సీవీ కుమార్‌ను పరిశీలకులుగా, అదనపు పరిశీలకులుగా శైలజా చరణ్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొంది.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి



జగదీశ్వర్ పిళ్లై (ఫైల్)

బంగారుపాళెం: మొగిలి మిట్టూరులో నివాసమున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు జగదీశ్వర్‌పిళ్లై మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుని స్వగ్రామంలో జగదీశ్వర్‌పిళ్లై భౌతికకాయాన్ని పలువురు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లోకేష్

బంగారుపాళెం: ఆశా వర్కర్లు గ్రామాల్లో ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్, పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మంగళవారం ఆశా డే సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజలు జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఆశా వర్కర్లు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్వో చిన్నయ్య

తవణంపల్లె: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని చిత్తూరు ఆర్డీఓ, పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. చిన్నయ్య ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కాణిపాకం హైవే బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని 15 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ రెడ్డి బాబు, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, బీఎల్వోలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నేడు సదుంలో సీఎం రోడ్‌షో

సదుం: మండలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా రోడ్‌షో నిర్వహించనున్నారు. అమ్మగారిపల్లె బేస్ క్యాంపు నుంచి ఆయన పర్యటన ప్రారంభమై మండల కేంద్రంతో పాటు భట్టువారిపల్లె, గొడ్లవారిపల్లె, బూరగమంద క్రాస్ మీదుగా ఆయన రోడ్‌షో సాగి అనంతరం పులిచెర్ల మండలంలోకి ఆయన యాత్ర ప్రవేశించనుంది. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

పిచ్చాపాటీ'!

వచ్చెరా ఎలక్షన్
మెచ్చగ రారా బాంచెన్
'ఫ్యాను' విజయమే వరింపన్



స్థానికులతో టీ తాగుతూ ముచ్చటిస్తున్న విజయానందరెడ్డి

అనే లెవెల్లో విజయానందరెడ్డెన్న ఓటర్లతో పిచ్చాపా'టీ'గా ముచ్చటించారు. మంగళవారం ఉదయాన్నే చిత్తూరు వైఎస్సార్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి 'గుడ్ మార్నింగ్ అన్నా' అంటూ స్థానిక సంతపేట కూడలి, అంబేడ్కర్ విగ్రహం ప్రాంతాల్లోని టీ స్టాల్స్ వద్ద స్థానికులతో ముచ్చటించారు. అక్కడే కూర్చున్న ఆయన.. మంచి స్ట్రాంగ్ టీ వేయన్నా? అని కోరడంతో టీ దుకాణ యజమాని అందరికీ పొగలు కక్కేలా వేడి..వేడిగా టీ ఇచ్చారు. ఇక ఆయన టీ తాగుతూ..ఏమన్నా ఎలా ఉన్నావు? పిల్లలు ఏమి చేస్తున్నారు? స్థానికంగా సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఏయే ప్రభుత్వ పథకాల సాయం పొందారు? అని అడిగి తెలుసుకున్నారు. పేద, మధ్య తరగతి వారు కుటుంబ, సామాజిక, రాజకీయ అంశాలకు వేదిక టీ స్టాల్స్, చిల్లర అంగళ్లేనని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థినీ గెలిపించాలని కోరారు. గెలిపిస్తే సంతపేటలో నవోదయ పాఠశాల ఏర్పాటు, డంపింగ్ యార్డు తరలింపు, మురకంబట్టు–సంతపేట రోడ్డు మరమ్మతు, మంగసముద్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట నగర పార్టీ అధ్యక్షులు జ్ఞాన జగదీష్ నాయకులు అప్పోజీ, సీకే ద్వారక, నారాయణ ఉన్నారు.

–చిత్తూరు కార్పొరేషన్

గుడిపాలలో 'ఫ్యామిలీ డాక్టర్'





గుడిపాల: రోగులను పరీక్షిస్తు, డాక్టర్ చంద్రమహేష్, వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

గుడిపాల: ఇళ్ల ముంగిటకే అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమహేష్ కోరారు. మంగళవారం గుడిపాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి రోగులకు బీపీ, షుగర్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది సోనియా, చంద్ర, సింధు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత కోరారు. గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి విగ్రహావిష్కరణ చేశారు. పూర్వ విద్యార్థి పాండియన్ తన సొంత ఖర్చుతో ఈ విగ్రహాన్ని తయారు చేయించి ఇచ్చారని ప్రధానోపాధ్యాయుడు రమేష్ తెలిపారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, నాయకులు వేలుస్వామి పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎంసీఎంసీ కమిటీ బాధ్యతగా వ్యవహరించాలి


–చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు



ఎంసీఎంసీ కేంద్రంలో మాట్లాడుతున్న చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ బాధ్యతగా వ్యవహరించి విధులు నిర్వర్తించాలని చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రాజకీయ ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. పత్రికల్లో, న్యూస్ చానల్స్, సోషల్ మీడియాల్లో వచ్చే ప్రకటనలను నిత్యం పరిశీలించాలన్నారు. విధుల పట్ల ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. రాజకీయ పార్టీలు ప్రకటనలకు సంబంధించి తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతి పొందాలన్నారు. రాజకీయపార్టీల ప్రచారాలు, ప్రకటనల నిమిత్తం నిర్ణీత ఫార్మెట్‌లో తేదీ, సమయం, ఏ చానల్, ఏ పార్టీ వంటి వివరాలు తయారు చేసి నోడల్ అధికారికి అందజేయాలన్నారు. ఆ తర్వాత కమిటీ పరిశీలించి అనుమతులు ఇస్తుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు పెయిడ్ న్యూస్ సంబంధిత పార్టీల ఖాతాల్లో, ఆ తర్వాత అభ్యర్థుల ఖాతాలకు జమ చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంసీఎంసీ నోడల్ అధికారి నాగేశ్వర రావు, ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ, డీఎల్‌పీఆర్‌ఓ రమణ పాల్గొన్నారు.

నేడు పూతలపట్టుకు సీఎం రాక



సభా ప్రాంగణం

పూతలపట్టు: మేము సిద్ధం బస్సు యాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి రానున్నారు. ముందుగా మండలంలోని పాటూరు నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు రంగంపేట క్రాస్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. గోపాలకృష్ణాపురం సమీపంలో జరిగే సభలో సీఎం పాల్గొననున్నారు. మంగళవారం సభా ప్రాంగణ ఏర్పాట్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సీఎం బహిరంగ సభను పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రికి తేనెపల్లి టోల్ ప్లాజా సమీపంలో భోజన వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబు రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ చైర్మన్ శైలజాచరణ్ రెడ్డి, నేతలు మోహన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



సిద్ధమైన సభా ఆవరణం